క్లుప్తంగా

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

నంద్యాల: క్రోధి నామ సంవత్సరాన్ని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో జిల్లా ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఏడాది చైత్ర శుద్ధ ప్రాద్యమినాడు ఉగాది పండుగ నిర్వహించుకుంటామని, ఉగాది రోజు బ్రహ్మ సృష్టిని నిర్మించాడని, అలాగే శ్రీ విష్ణుమూర్తి మత్స్య అవతారం ధరించి సోమకుణ్ణి సంహరించి వేదాలను సంరక్షించాడని, ఆ వేదాలను బ్రహ్మకు అప్పగించిన సందర్భంగానే ఉగాది పండుగ ఉద్భవించిందని పురాణాలు చెబుతున్న నేపథ్యంలో ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాలలో సుఖసంతోషాలు నింపాలని వారు ఆకాంక్షించారు.

వాల్మీకుల్లో చైతన్యం రావాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకుల్లో రాజకీయ చైతన్యం రావాలని ఎంవీఆర్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులికొండన్న అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణపై 67 ఏళ్లుగా పాలకులు వాల్మీకులను మోసం చేస్తూనే ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాలుస్వామి, సుబ్బరాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



రుద్రవరంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక పెద్దమ్మ అమ్మవారు,శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారిశాల, సంత మార్కెట్, ఆటో స్టాండ్ వద్ద కూల్ మినరల్ వాటర్ చలివేంద్రాలను సర్పంచు బైరి విజయలక్ష్మి కుటుంబ సభ్యులు సోమవారం ఏర్పాటు చేశారు. ఎండలు మండుతుండటంతో బాటసారులు, వృద్ధులు, సంతకు వచ్చే వారు దాహంతో ఇబ్బందులు పడకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బైరి శ్రీహరి,కొల్లం పుల్లయ్య, బాబు, లింగం బ్రహ్మయ్య, రహిమాన్ ఉన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

నంద్యాల(అర్బన్): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డు హెచ్ఎం వేణుగోపాల్ తెలిపారు. సోమవారం మండలంలోని కానాల గ్రామంలో జరిగిన స్థానిక నారాయణ పాండే ఇంగ్లిష్ మీడియం పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి ఆయన రూ.5116 అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ పాండే, కమిటీ సభ్యులు సాయిరాం, సుధాకర్‌రావు వేణుగోపాల్‌ను సన్మానించారు.

బార్ ఎలక్షన్ కమిటీ ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం 2024-25 సంవత్సరం న్యాయవాదుల ఎన్నికలకు సంబంధించిన ఎలక్షన్ సభ్యులను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ఆఫీసర్లుగా సీనియర్ న్యాయవాదులు రామకృష్ణయ్య, చిన్న సుదాంశరెడ్డి, రఘు ప్రకాష్, ఎస్ఎన్ రాజేశ్వరరెడ్డి, అల్లాబకాష్‌ను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ త్వరలో బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

నంద్యాల(సిటీ): పట్టణంలో 39వ వార్డుకు చెందిన 22 మంది వలంటీర్లు సోమవారం తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డికి అందజేశారు.

జన్మభూమి కమిటీలపై మొదటి సంతకం చేస్తారా?



పెద్దవంగలిలో ప్రచారం చేస్తున్న అవంతికా రెడ్డి

చాగలమర్రి: రానున్న ఎన్నికల్లో గెలిచిన వెంటనే వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుపై తొలి సంతకం చేస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారని, జన్మభూమి కమిటీలను నియమిస్తూ సంతకం చేస్తానని ప్రకటించే ధైర్యం చంద్రబాబుకు ఉందా అని గంగుల అవంతికరెడ్డి ప్రశ్నించారు. సోమవారం మండలంలోని పెద్దవంగలి గ్రామంలో సర్పంచ్ బంగారు షరీఫ్, జెడ్పీటీసీ లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ ఎర్రం పుల్లయ్య, ప్రభాకాంత్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు జన్మభూమి కమిటీల పేరిట ప్రభుత్వ పథకాలన్నీ వారి కార్యకర్తలు, నాయకులకు కట్టబెడితే జగనన్న మాత్రం వలంటీర్ల సహకారంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారని చెప్పారు. ఎమ్మెల్యేగా గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు జి.గణేష్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు మౌలీబాషా, గోవిందయ్య, జ్యోతీశ్వరరెడ్డి, జబ్బార్, మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, మల్లేశ్వరరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, డైరెక్టర్ గౌస్‌పీరా , అబ్దుల్ కలాం, నరసింహుడు, కృష్ణ పాల్గొన్నారు.



ఎస్.కూలూరులో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్



రాయపాడు పంచాయతీ కార్యాలయానికి ఏర్పాటు చేసిన కాంపౌండ్



అంగన్‌వాడీ భవనం



ఒంటివెలగలలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ



ఒంటివెలగలలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

మారిన పల్లె ముఖచిత్రం

- మౌలిక వసతుల కల్పనతో ప్రజలకు తీరిన ఇక్కట్లు
- రాయపాడులో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఎస్.కూలూరులో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- అభివృద్ధి పనులతో మారిన రూపురేఖలు
- డీబీటీ, నాన్ డీబీటీ కింద గ్రామస్తులకు రూ.13.65 కోట్ల లబ్ధి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పల్లె ముఖ చిత్రం మారింది. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, వైద్యశాలలు, గోదాములు, బడులను నూతనంగా తీర్చిదిద్దడం, మౌలిక వసతుల కల్పనతో పాటు అర్హత కలిగిన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుండటంతో ప్రజల జీవన ప్రమాణం మెరుగుపడింది. అభివృద్ధి పనులు చేపట్టడంతో స్థానికులకు ఇబ్బందుల తప్పాయి.

గోస్పాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి జంటగా గ్రామాల్లో అడుగు పెట్టడంతో ప్రజల మోమున దరహాసం విరబూస్తోంది. ఏక కాలంలో పేదలకు సంక్షేమ పథకాలు అందజేసి వారి అభ్యున్నతికి కృషి చేయడం, మరో వైపు గ్రామసచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్, సీసీ రోడ్లు, మంచి నీటి వసతి, డ్రైనేజీలు, శ్మశానాల అభివృద్ధి, తదితర పనులు చేపట్టడంతో ఒంటివెలగల గ్రామ సచివాలయ పరిధిలో ఎస్.కూలూరు, రాయపాడు గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయి. కోట్లాది రూపాయలతో పనులు చేపట్టడంతో వసతులు సమకూరాయి. ఆయా గ్రామాల్లో గతంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడేవారు. తాగేందుకు మంచినీరు లేక వారి అవస్థలు వర్ణనాతీతం. ఇక ఏ చిన్న జబ్బు సోకినా వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం ఈ బాధలేవి లేవు. దీంతో జనం సంతోషంగా ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు....

టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందుతుండేవి. అవి కూడా అరకొరగా ఉండేవి. వైఎస్సార్‌సీపీ పాలనలో ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. అవినీతి, అక్రమాలకు తావులేకుండా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకే నేరుగా నగదు జమ అవుతోంది. ఒకటోతేదీన ఇంటి వద్దకే పింఛన్లు అందేలా చేశారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు విద్యార్థుల ఉన్నత చదువులకు దోహదపడు తున్నాయి. పొదుపు మహిళలు ఆర్థికాభివద్ధికి ' చేయూత' పథకం ఆసరాగా నిలిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్ల రూపాయాల్లో ప్రభుత్వం నుంచి సాయం అందడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) పద్ధతిలో వివిధ పథకాల ద్వారా గ్రామస్తులు రూ.10.79 కోట్లు, పరోక్ష ప్రయోజనం కింద 8పథకాలకు గాను రూ.2.87కోట్లు లబ్ధి పొందారు. మొత్తం రూ.13.65 కోట్ల ప్రయోజనం చేకూరింది. ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



ఒంటివెలగల పాఠశాలలో ఏర్పాటు చేసిన బెంచీలు

అభివృద్ధి పనులు.. ఖర్చు చేసిన మొత్తం...

- సచివాలయం భవన నిర్మాణానికి రూ.40 లక్షలు
- రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణానికి రూ.21.80 లక్షల విడుదల
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు రూ.17.50 లక్షల కేటాయింపు
- ఒంటి వెలగల ఎస్సీ కాలనీలో రూ.1.75 లక్షలతో కుంట పూడ్చివేత
- ఒంటివెలగలలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలకు రూ.35 లక్షల వెచ్చింపు
- గడపగడపకు మన ప్రభుత్వం కింద రూ.7లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం
- ఎస్.కూలూరులో సీసీ రోడ్డు, పైప్ కల్వర్టు, బరియల్ గ్రౌండ్ రూ.6లక్షలతో అభివృద్ధి
- ఎస్.కూలూరులో మినరల్ వాటర్ ప్లాంట్, జల్‌జీవన్ మిషన్ కింద గ్రామంలో పైప్‌లైన్ల ఏర్పాటుకు రూ.4లక్షలు మంజూరు.
- రాయపాడులో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు రూ.15లక్షల ఖర్చు
- రాయపాడులో అంగన్‌వాడీ భవనాన్ని రూ.12లక్షలతో నిర్మించారు.
- రాయపాడులో రూ.20 లక్షలతో పంచాయతీ భవనం, ప్రహరీ, శ్మశానం రోడ్లు ఏర్పాటు
- జల్‌జీవన్ మిషన్ కింద గగ్గటూరు నుంచి రాయపాడుకు పైప్‌లైన్ ద్వారా సంప్ ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ.36.75 లక్షలతో పనులు చేపట్టారు.
- నాడు -నేడు కింద ఒంటి వెలగల, ఎస్.కూలూరు, రాయపాడు గ్రామాల్లో రూ.37 లక్షలతో పాఠశాలల అభివృద్ధి

గ్రామాల అభివృద్ధికి ఎంతో తోడ్పాటు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు పెద్ద మొత్తంలో నిధులను మంజూరు చేశారు. అభివృద్ధి ఒకవైపు, మరోవైపు సంక్షేమం ఉండేలా చర్యలు చేపట్టడం అద్భుతం. సంక్షేమ పథకాలను అర్హత గల ప్రతి కుటుంబానికి అందజేశారు. మా సచివాలయ పరిధిలో రహదారులు, డ్రైనేజీ కాల్వలు, నీటి వసతి తదితర ఏర్పాటు చేశాం.

– రాజారెడ్డి, సర్పంచ్ ఒంటివెలగల

వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు



ఒంటివెలగల గ్రామానికి మజరాగా ఎస్.కూలూరు గ్రామం ఉంది. అయితే ఎంతో కాలంగా గ్రామంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డాం. కుందూ పక్కన గ్రామం ఉండటంతో పాటు సరైన మంచి నీరు లేక అవస్థలు పడ్డాం. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

–తులసీశ్వరరెడ్డి, ఎస్.కూలూరు

ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు



గతంలో ఎన్నడూలేని విధంగా సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దకే వచ్చి అందజేశారు. ప్రతి నెలా మాలాంటి వృద్ధులకు ఇంటివద్దకే వచ్చి పింఛన్ సొమ్మును అందించేలా చర్యలు చేపట్టడం సంతోషంగా ఉంది. గ్రామంలో ఎంతోకాలంగా అభివృద్ధికి నోచుకోని పాఠశాల, అంగన్‌వాడీ భవనాలను తీర్చిదిద్దారు. దాదాపు సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి.

–నామాల వెంకటేశ్వర్లు, రాయపాడు

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

ఆళ్లగడ్డ: మండల కేంద్రం శిరివెళ్ల ఎస్సీ కాలనీకి చెందిన జోజీ, ప్రదీప్, ప్రశాంత్, బాలయ్య, సురేష్, జోసఫ్‌లతో పాటు సుమారు 20 కుటుంబాలు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సలాం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి వీరికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

మేలు చేసిన జగనన్నను మళ్లీ గెలిపిద్దాం



చిత్రేనిపల్లెలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

రుద్రవరం: నవరత్నాలతో పాటు వివిధ సంక్షేమ పథకాల అమలుతో మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డితో కలిసి మండలంలోని టి.లింగందిన్నె, తిప్పారెడ్డిపల్లె, హరినగరం, చిత్రేనిపల్లె, నర్సాపురం, పెద్దకంబలూరు, ఆలమూరు, ముత్తలూరు, నల్లవాగుపల్లె గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నాయని ఈ ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీనే గెలిపించుకునేందుకు కలసికట్టుగా కృషి చేయాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించాలని సూచించారు.ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా గంగుల బిజేంద్రారెడ్డిని మరోసాగి గెలిపించుకోవాలని చెప్పారు. ఆరు పథకాలంటూ టీడీపీ వారు మాయ మాటలతో వస్తున్నారని వారి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించాలన్నారు. టీడీపీకి అధికారం ఇస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో మళ్లీ గతంలో అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. నాయకులు ఎర్రం నర్సిరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగముని, వెంకటసుబ్బయ్య, రమణయ్య, బాలయ్య, గుండా వెంకట నరసింహ్మయ్య, నాగేష్, చంద్ర, జయరాముడు, ప్రభాకర్, రహీం, మదు,చిన్న మాధవ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎంఎస్ నగర్‌కు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు షేక్ మహబూబ్ బాషా, మొఘల్ ఫయాజ్ బేగ్, మహమ్మద్ రఫీ, ఖాజావలి, షబ్బీర్, హలీమా బీ, జహిరాబీ, చాంద్‌బీ, గౌసియా, రహనా, హసీనా, రసూల్ బీ, మహమ్మద్ అయూబ్ ఖాన్ సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి ఆధ్వర్యంలో శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. రూరల్ మండలం ఆర్ కృష్ణాపురం గ్రామంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, సంతోషం కొనసాగాలంటే మళ్లీ జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొట్టి నాగేశ్వర్‌రావు, నాయకులు కృష్ణారెడ్డి, రంగారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, అశోక్, సుబ్బరాయుడు, మల్లయ్య, తులసి, ఓబులంపల్లె రామ్మోహన్‌రెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి ఉన్నారు.

ముందస్తు పన్ను చెల్లింపుపై 5శాతం రాయితీ

నంద్యాల(సిటీ): నూతన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు ఆస్తి పన్ను ఈ నెలాఖరులోగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పన్నును ముందస్తుగా చెల్లించే వారికి 5శాతం రాయితీని మరోమారు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ నెల 30లోపు ఏకమొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందని, మున్సిపల్ కార్యాలయంలో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7గంటల వరకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఇక్బాల్ విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న యూనిస్

నంద్యాల(అర్బన్): రిటైర్డు డీఐజీ, ఎమ్మెల్సీ ఇక్బాల్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి యూనిస్ విమర్శించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వప్రయోజనాల కోసం ఇక్బాల్ ముస్లింలను వాడుకున్నారే కాని ముస్లింల సంక్షేమానికి ఏనాడు పాటు పడలేదన్నారు. ఎమ్మెల్సీగా ఏనాడు ముస్లింల హక్కులపై దేశ వ్యాప్తంగా ముస్లింలపై జరుగుతున్న దాడుల పైన, సీఏఏ పైన ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. సమావేశంలో అబ్బాస్ అలీ, మహమ్మద్ అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

షడ్రుచుల వేడుక.. ఉగాది

- ఉగాదికి ముస్తాబైన ఆలయాలు
- భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు
- పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం



వేప పూత, మామిడి ఆకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



ముస్తాబైన బైటిపేట ఆంజనేయస్వామి ఆలయం



టెక్కెలో ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ

నంద్యాల(వ్యవసాయం): పులుపు, కారం, తీపి, వగరు, ఉప్పు, చేదు.. ఈ ఆరు రుచుల కలయికే ఉగాది పండుగ. తెలుగు సంవత్సరం శ్రీ క్రోధినామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగులు చల్లుకొని సంబరాలు చేసుకోవడానికి పట్టణ ప్రజలు సిద్ధమవుతున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం పలు ఆలయాల్లో పూజలు, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు, విశేష పూజలు, మూలమూర్తులు, ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరిస్తారు. నంద్యాలలో తెలుగు సంవత్సరం ప్రారంభోత్సవ సందర్భంగా ప్రత్యేకంగా సంబరాలను నిర్వహించుకుంటారు. హోలీ తరహాలో పిల్లలు, పెద్దలు ఒకరినొకరు రంగులు చల్లుకొని కేరింతలు కొడుతూ అభినందనలు తెలుపుకొని ఆనందోత్సాహంగా గడుపుతారు. పలు వీధుల్లో ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లపైన, ఆటోలపై డ్రమ్ములను పెట్టుకొని యువకులు పట్టణ పురవీధుల్లో తిరుగుతూ రంగులు చల్లుతారు. ప్రధానంగా వన్‌టౌన్, బొమ్మలసత్రం, నూనెపల్లె తదితర ప్రాంతాల్లో అధికంగా రంగుల బండ్లు కనిపిస్తాయి. ఇప్పటికే రంగుబండ్ల తయారీలో నిమగ్నమయ్యారు.

గాంధీచౌక్ కిటకిట..

పండుగకు అవసరమైన సరుకుల కొనుగోలుదారులతో పట్టణంలోని గాంధీచౌక్ సోమవారం రద్దీగా మారింది. కాగా రోడ్డు పనులు జరుగుతుండటంతో కొంత ఇబ్బందులు ఎదురయ్యాయి. అరిటాకులు, మామిడాకులు, వేప పూత, మామిడి కాయలు, వేపపూత, అరటిఆకులు,పూలు,పండ్లు, డ్రైఫ్రూట్స్, తీపి వంటకాలు తయారు చేయడానికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడానికి ప్రజలు భారీ సంఖ్యలో రావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసి పోయింది. సంజీవనగర్, టెక్కె, మార్కెట్ యార్డు, సాయిబాబానగర్ ఆర్చి తదితర ప్రాంతాల్లో రద్దీ నెలకొంది.

పంచాంగశ్రవణం..

ఉగాది పండుగను పురస్కరించుకొని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సంజీవనగర్ రామాలయం, బ్రాహ్మణ సంఘం, ఎస్‌బీఐ కాలనీ రామాలయం, బైటిపేట ఆంజనేయస్వామి దేవాలయాల్లో పంచాంగ శ్రవణం ఉంటుంది. వివేకానంద ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు.

మంచికి శ్రీకారం ఉగాది...

పట్టణంలోని వ్యాపారస్తులు తమ వ్యాపారం అభివృద్ధి చెందడం కోసం దస్కం పూజలు, వేసవి కాలం రావడంతో చలివేంద్రాల ఏర్పాటు, అలాగే ఉగాది రోజు వసంతోత్సవాన్ని నిర్వహించుకుంటూ.. బ్రాహ్మణులకు గొడుగులు, చెప్పులు, విసన కర్రలు, వస్త్రాలు దానం చేస్తారు.

ముస్తాబైన ఆలయాలు..

ఉగాది వేడుకలకు పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలోని కోదండ రామాలయం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం, మెయిన్ బజార్‌లోని, ఉప్పరిపేటలోని సుంకులమ్మ ఆలయాలు, నాగులకుంట రోడ్డు, బొమ్మలసత్రంలోని షిర్డిసాయిబాబా ఆలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.